క్లుప్తంగా

ఆలయంలో రుద్రహోమం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రుద్రహోమం నిర్వహించారు. శివ మాలధారణ చేసి 41రోజుల పాటు దీక్ష చేస్తున్న వారితో అర్చకులు వేదమంత్రాలతో రుద్రపఠనం చేస్తూ హోమం జరిపించారు. హోమంలో పాల్గొనేందుకు మాలధారుల కుటుంబ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాలధారులకు (భిక్ష) అన్నదానం చేశారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వానం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవాలకు రావాలంటూ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేలను వేరువేరుగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆలయంలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు వస్తామని ఎమ్మెల్యేలు చెప్పినట్టు వారు తెలిపారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖరయ్య, జగదీష్‌స్వామి, జగదీశ్వర్, అనిల్‌స్వామి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి



వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారుల్లో తక్కువ బరువు ఉన్న వారిని గుర్తించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పల్స్ పోలియో, పసిపిల్లల శ్రద్ధ అనే అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోషకాహార లోపం గల పిల్లలను ఎత్తు, బరువులు పరీక్షించి వారికి అవసరమైన మందులు, పోషక పదార్థాలపై అంగన్‌వాడీ టీచర్లు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం



పాన్‌గల్: ప్రమాదవశాత్తుతో పశుగ్రాసం దగ్ధమయిన ఘటన మంగళవారం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు గుణగంటిరాములుకు చెందిన రెండు ట్రాక్టర్ల పశుగ్రాసం(వరిగడ్డి) పశువుల మేత కోసం గ్రామ సమీపంలోని పంట పొలంలో నిల్వ చేశాడు. పశుగ్రాసానికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూర్తిగా కాలి బూడిద అయింది. దీని విలువ దాదాపుగా రూ.10 వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా సహాయం చేసి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

వైద్య శిబిరం ఏర్పాటు



మదనాపురం: మండలంలోని దంతనూర్‌లో జ్వర బాధితులు అధికంగా ఉండటంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ భవానీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులను పంపిణీ చేశారు. గ్రామస్తులు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, విజయ్, చంద్రమ్మ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలి

కోడేరు: అర్హులందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండీ మాలిక్, వెంకటమ్మ, రవి, శివశంకర్ వరప్రసాద్, మరాటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో, ప్రగతి హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఫయాజ్, ఉపాధ్యాయులు, సీఆర్పీ సౌమ్య, విద్యార్థులు ఉన్నారు.

జూరాలలో..

జూరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలను బోధించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం రాఘవేందర్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, షకీల్‌అహ్మద్, నాగప్రియ, భానుప్రియ, నరేష్, రోజ, సీఆర్పీ సౌమ్య, విద్యార్థులు ఉన్నారు.



ఏదుట్లలో..

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సంధ్య, డీఈఓగా రాఘవేందర్‌రాజు, ఎంఈఓగా వివేక్, కలెక్టర్‌గా సిద్దార్థ, వీరితో పాటు ముప్పై మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం బహుమతులు అందించారు.



జూరాలలో..

ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కూలీలు

మదనాపురం: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దుప్పల్లి, లక్ష్మీపురం, కొత్తపల్లి, నెలివిడి గ్రామాల ఉపాధి కూలీలు మంగళవారం మండల ఎంపీడీఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజు రూ.800 కూలి ఇవ్వాలని లేదా కొలతలనైనా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ గ్రామాల్లో కూలీలు అనేక మంది పనులకు వస్తున్నారని పేర్కొన్నారు. కొలతలు పెట్టడంతో ప్రతి కూలీకి రూ.100 లోపే కూలి వస్తుందని వాపోయారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ చెన్నమ్మకు అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రాములు, అజయ్, పడిగెన్న, వనజ, నిర్మల, జానమ్మ, మహేంద్ర, అల్లన్న, కురుమన్న, పద్మ, సంధ్య, బాలమ్మ, కావలి కొండన్న, సంధ్య, మంగమ్మ, గోవిందమ్మ, గిరమ్మ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రాయినిపల్లి పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి ప్రాథమిక, మాందాపూర్‌లో ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు వచ్చేలా బోధన చేయాలన్నారు.

బడిబయటి విద్యార్థిని గుర్తింపు

మండలంలోని గోప్లాపూర్‌లో బడిబయటి ఉన్న 8వ తరగతి విద్యార్థిని శ్రీవాణి గుర్తించి బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులను సీఆర్పీలు ఒప్పించారు. గ్రామంలో బడిబయటి పిల్లల గుర్తింపులో భాగంగా సీఆర్పీలు ఇంటింటికీ తిరుగుతూ చదువు ప్రాముఖ్యత, చదువుకుంటే కలిగే లాభాలు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. బడిఈడు పిల్లలను తప్పక బడికి పంపించాలని సీఆర్పీలు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తకోట రూరల్: సైబర్ నేరగాళ్లతో పాటు బస్టాండ్‌లో, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఏఎస్ఐ సాగర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మంగళవారం కొత్తకోట బస్టాండ్‌లో ప్రయాణికులకు నేరాలు, నేరస్తులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్లు, కూల్‌డ్రింక్స్, ఇతర పదార్థాలు ఇస్తే తీసుకోవద్దని, ఒక వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే పదార్థాలను తీసుకుంటే మత్తులోకి వెళ్లిన తర్వాత విలువైన బంగారు నగలతో పాటు డబ్బులను దోచుకెళ్తారన్నారు. అదే విధంగా ఫోన్‌కు గుర్తు తెలియని ఫోన్ నంబర్‌ను నుంచి వచ్చే లింక్‌లు, మెసేజ్‌లకు స్పందిస్తే ఖాతాల్లో డబ్బులు లాక్కుంటారని వివరించారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదును పెట్టి రెండు, మూడు రోజులు బయటి ప్రయాణాలు చేయొద్దని, విలువైన వస్తువులను బ్యాంకుల్లో లేదా బంధువుల వద్ద ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాములు మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 112 మంది, ద్వితీయ సంవత్సరంలో 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతున్నందున పరీక్ష కేంద్రాన్ని అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఇంటర్ పరీక్షల దృష్ట్యా కళాశాల పరిసరాలల్లో గుంపులు, గుంపులుగా ఉండకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బాలస్వామికి జాతీయ ఎక్సలెన్సీ అవార్డు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జర్నలిస్ట్ బాలస్వామి

వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మల్యాల బాలస్వామి అతిథి జాతీయ తెలుగు ఎక్సలెన్సీ అవార్డు 2024ను జర్నలిస్ట్ కోటాలో దక్కించుకున్నారు. 40 ఏళ్లుగా జర్నలిస్ట్ రంగంలో చేస్తున్న కృషికిగాను సోమవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన తెలుగు జాతీయ అతిథి వార్షికోత్సవంలో భాగంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వికాస ఫార్మసీ కళాశాల చైర్మన్ రాందాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలుగు జాతీయ వార్షికోత్సవంలో భాగంగా ప్రతి ఏటా సామాజిక, సాంస్కృతిక, జర్నలిజం తదితర రంగాల్లో సేవలు అందించిన వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది జర్నలిస్ట్ కోటాలో అపార అనుభవం ఉన్న బాలస్వామికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు, రాజకీయ నాయకులు మల్యాల బాలస్వామికి అభినందనలు తెలిపారు.

భరోసా కేంద్రం వినియోగంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'భరోసా సెంటర్' వినియోగంపై ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశానుసారం మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ సభ్యురాలు నాగలక్ష్మి మానవ అక్రమ రవాణా, షీ టీం, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా అత్యాచారానికి, లైంగిక వేధింపులకు గురైన బాలబాలికలను ఒకే గొడుగు కిందకి తీసుకొచ్చి అన్ని రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు. బాధితురాలికి ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తూ మేమున్నామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరచారి, హోంగార్డు కృష్ణసాగర్, ఉపాధ్యాయ బృందం కృష్ణయ్య, వెంకటస్వామి, భగవంతు, రాజేంద్రబాబు, జయసింహారెడ్డి, శశికళ, కృష్ణవేణి, ఏఎన్ఎం రాణి ఉన్నారు.

ముళ్లపొదలు తొలగించాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని ఓపెన్ ప్లాట్లలో పెరిగిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను ప్లాట్ల యజమానులు తొలగించుకోవాలని పుర కమిషనర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయని, అందులో చెత్తాచెదారం చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని వ్యాపారస్తులు తమ దుకాణ సముదాయాలకు సంబంధించిన లైసెన్సులను తీసుకోవాలని పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని కోరారు. చెత్తను మున్సిపల్ ట్రాక్టర్లకు అందించి స్వచ్ఛ అమరచింత ఏర్పాటుకు సహకరించాలని సూచించారు.

చంద్రశేఖర్ ఆజాద్ త్యాగం మరువలేనిది



వనపర్తిలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నిప్పుకణంలా పోరాడి ఆత్మ త్యాగం చేసుకున్న చంద్రశేఖర్ ఆజాద్ దేశభక్తి మాటల్లో చెప్పలేనిదని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ 93 వర్ధంతిని సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్న నాయుడు, బండలయ్య, బాలేమియా, వెంకటస్వామి, పరమేశ్వరచారి, గంగాధర్ చారి, సత్యం చారి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మంగళవారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరిగోపి ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశం గర్వించదగిన ఉద్యమకారుల్లో చంద్రశేఖర్‌ఆజాద్ ఒకరన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..

కార్యదర్శిపై దాడి అనైతికం



డీఎల్‌పీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూర్: విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి ఘటనలో పోలీస్‌స్టేషన్‌లో, డీపీఓ, డీఎల్‌పీఓలకు పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమైన కార్యదర్శులు ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. సోమవారం మండలంలోని రేచింతలలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి మణ్యంపై మాజీ వార్డు సభ్యుడు రాములు పరుష పదజాలంతో దూషిస్తూ, దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. గ్రామస్తులు నిలువరించిన కార్యదర్శిపై నిర్లక్ష్యంగా ప్రవర్తించాడని మండిపడ్డారు. విధుల్లో ఉన్న కార్యదర్శిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వనపర్తికి చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని బ్లాసమ్స్ ప్లేవే స్కూల్ 20వ వార్షికోత్సవాన్ని మంగళవారం నాగవరం శివారులోని ఓ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కరస్పాండెంట్, హెచ్ఎం అనురాధ, సుధాకర్, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉన్నాసబేగం, రహీం, కురుమన్న, రఘునాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లెల చిన్నారెడ్డికి సన్మానం



పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులు అయిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దుల విజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, బునాదిపురం నరేందర్, సాయిరెడ్డి, కృపాకర్‌రెడ్డి, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోడేరు: విద్యుత్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఈ రాకేష్, ప్రభాకర్‌లు కోరారు. ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి పథకం అమలు వచ్చే నెల నుంచి ప్రారంభం అవుతుందని పాత బకాయిలు ఏమైనా ఉంటే ఈ నెల 29 తేదిలోగా చెల్లించాలని పేర్కొన్నారు. పాత బకాయిలు ఉంటే పథకానికి అర్హులు కారని వివరించారు.

కూలీల సంఖ్య పెంచాలి



వెంగళాయిపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ కోటేశ్వర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని అన్నారంతండా, వెంగళాయిపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులు, నర్సరీలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరంగా ఉండే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనుల వద్ద కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకంచేస్తున్న కార్యకర్తలు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో రెండింటిని ప్రారంభించడంతో పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లికృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సుతో పాటు ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చిన ప్రభుత్వం, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాలకు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులు భవిష్యనిధిని సద్వినియోగం చేసుకోవాలి



కార్మికులకు గుర్తింపు కార్డులిస్తున్న అధికారులు

ఆత్మకూర్: బీడీ కార్మికులు, మున్సిపల్ కార్మికుల నిధి ఆప్కేనిఖత్ 2.0 (భవిష్యనిధి)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి ఓబుల్‌నాథ్ నాయక్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈపీఎఫ్ సభ్యులకు, కార్మికులకు అవగాహన కల్పించారు. భవిష్యనిధి సంస్థ మాదాపూర్, హైదారాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో కార్మికులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కేవైసీ ఆన్‌లైన్‌లో పొందుపర్చుకోవాలని, కార్మికుల పేర్లు, తండ్రి పేరు, ఇతర వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీడీ కార్మికుల సంఘం నాయకులు రాజు, ప్రసాద్, హన్మంతు, పీఎస్ సిబ్బంది మారుతి, రాకేష్, అభిలాష్‌జైన్, కార్మికులు ఉన్నారు.

కనులపండువగా శివ మహా పడిపూజ

అమరచింత: పట్టణంలో మంగళవారం నిర్వహించిన శివ మహాపడి పూజ కార్యక్రమం కనులపండువగా కొనసాగింది. శివ మాలధారుల బృందం మంగళవారం తెల్లవారుజామున గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జల్దిబిందేలతో పవిత్ర కృష్ణా జలాలను తీసుకొచ్చి ఆలయంలో శివలింగానికి అభిషేకించారు. అనంతరం శివుడి ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ, కలశ సేవా కార్యక్రమాన్ని పట్టణ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణనగర్‌లోని శివాలయ ఆవరణంలో శివ మాలధారులు శివమహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలే కాకుండా ఇతర గ్రామాల్లోని శివ మాలధారులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నదానంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందించారు.



అమరచింతలో శివమహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com